క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామి సేవలో కిలివేటి సంజీవయ్య



కిలివేటికి చిత్ర పటాన్ని ఇస్తున్న పురోహితులు

చిట్టమూరు: మల్లాం గ్రామంలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. ఆయన్ను సత్కరించి స్వామి అమ్మవార్ల చిత్ర పటాన్ని సమర్పించారు. మల్లాంకు చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నేత దువ్వూరు శేషురెడ్డి ఇటీవల గుండెపోటుకు గురై చికిత్స తీసుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. శనివారం కిలివేటి సంజీవయ్య ఇంటికెళ్లి పరామర్శించారు. ఇటీవల శేషురెడ్డి గుండెపోటుకు చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో కిలివేటి వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

నేడు మోమిడికి కాకాణి రాక

చిల్లకూరు: మండలంలోని మోమిడి గ్రామానికి నేడు మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి రానున్నట్లు శనివారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేరిగ మురళీధర్ తెలిపారు. గూడూరు సనత్‌నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మోమిడికి గ్రామానికి చెందిన వేమారెడ్డి కుమారస్వామిరెడ్డిపై ఇటీవల కూటమి ప్రభుత్వం పెద్దలు అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేశారని, ఈక్రమంలో ఆయనకు పార్టీ అండగా ఉంటుందని తెలియజేసేందుకు కాకాణి వెళుతున్నట్లు తెలిపారు.

గాలికుంటు రాకుండా టీకాలు

చిల్లకూరు: పశువులు, జీవాలకు వర్షాకాలంలో వ్యాధులు రాకుండా ముందస్తుగా వేసే గాలికుంటు టీకాలను సత్వరమే వేయాలని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ సూచించారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం పశువైద్యాధికారులతో కలిసి ఆయన పోస్టర్లను విడుదల చేశారు. గూడూరు, కోట, చిల్లకూరు, మండలాలకు చెందిన పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



విజేతలకు మెడల్ ఇస్తున్న ఎంఈఓ

చిట్టమూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓ బీవీ కృష్ణయ్య అన్నారు. అరవపాళెం జెడ్పీ హైస్కూల్లో తడ శ్రీసిటీలోని మాండలైజ్ కంపెనీ సౌజన్యంతో మ్యాజిక్ బస్ నిర్వాహకులు మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. మండలంలోని 9 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 460 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విజేత జట్లకు మెడల్స్ అందజేశారు. ఎంఈఓ-2 భూపయ్య, హెచ్‌ఎం మంజుల, కో-ఆర్డినేటర్ సుమంత్, క్రీడల ఇన్‌చార్జ్ గునపాడు పాఠశాల పీడీ భరత్ మహీపతి, పీఈటీలు శ్రీధర్, శివ, సురేష్, నరేంద్ర, వెంకటేశ్వర్లు, సుప్రియ, చైతన్య, పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై రణభేరి



రణభేరి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

గూడూరురూరల్: ఆర్థిక, విద్యారంగ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు రణభేరి నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి సుధీర్ తెలిపారు. గూడూరులోని ఎంఈఓ కార్యాలయం వద్ద శనివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బైక్ జాతాను నిర్వహించనున్నామన్నారు. 25వ తేదీన విజయవాడలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని రణభేరి పేరుతో బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలతోపాటు విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని, పాఠశాలల్లో ఒత్తిడి లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ ద్వారా ప్రమోషన్లు కల్పించాలని కోరారు. 12వ పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, డీఏలు విడుదల, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ నేతలు ఎ.రవి, బి.మురళీసింగ్, ఎం.ప్రసాద్, మాధవరావు, శివాజీ, మురళీమోహన్, గురునాథం, వరప్రసాద్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు		14-09-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	148
లేయర్ లైవ్	:	115
బ్రాయిలర్ చికెన్	:	260
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	286
లేయర్ చికెన్	:	195

అత్యవసరమైతే నరకమే!

- ప్రభుత్వ కార్యాలయాల్లో కనిపించని మరుగుదొడ్లు
- ఇబ్బంది పడుతున్న జనం



మండల పరిషత్ కార్యాలయం



తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్మించిన మరుగుదొడ్డి దుస్థితి

కోట: పారిశుధ్యాన్ని మెరుగు పరిచేందుకు స్వచ్ఛ భారత్ పేరిట ప్రభుత్వం పరిసరాల పరిశుభ్రతకు భారీగానే నిధులను ఖర్చు చేస్తుంది. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడా స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరుతున్నట్లుగా కనిపించడం లేదు. బహిరంగ మలమూత్ర విసర్జన వద్దని చెప్పే అధికారులు కార్యాలయాల్లో మాత్రం వసతులను ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే వారు అత్యవసరమైతే ఆరు బయటకు పరుగులు తీయాల్సిందే. మహిళలైతే నానా అవస్థలు పడుతున్నారు. ప్రచారం చేసే చోటే మరుగుదొడ్లు లేవు. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఉంది. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, మండల విద్యావనరుల భవనం, పోలీస్‌స్టేషన్, కోర్టు, వ్యవసాయశాఖ, ఐసీడీఎస్, ఐకేపీ, హౌసింగ్, ఆర్‌అండ్‌బీ, అగ్నిమాపకశాఖ, ఉపాధి పథకం, మత్స్యశాఖ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. రోజూ వందల సంఖ్యలో జనం వివిధ పనులపై కార్యాలయాలకు వస్తుంటారు. కొన్ని ప్రధాన కార్యాలయాలకు జనం తాకిడి ఎక్కువగానే ఉంటుంది. ప్రతి వ్యక్తికి ఏదో సమయంలో కాలకృత్యాలు తీర్చుకోవాల్సి ఉంటుంది. ఈ సమయంలో మరుగుదొడ్లు సదుపాయం లేక వారు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. మహిళలు ఎక్కువగా వచ్చే ఐసీడీఎస్, ఐకేపీ కార్యాలయాల్లోను ఇదే పరిస్థితి ఉంది. కార్యాలయాలకు వచ్చే వారి కోసం కొన్నేళ్ల కిందట తహసీల్దార్ కార్యాలయం వద్ద మరుగుదొడ్డి నిర్మించినా నీటి సదుపాయం కల్పించక పోవడంతో అది నిరుపయోగంగా మారింది. మరుగుదొడ్ల నిర్మాణాన్ని పర్యవేక్షించి బిల్లులు మంజూరు చేయించే ఎంపీడీఓ కార్యాలయం వద్దే మరుగుదొడ్లు లేక పనులపై వచ్చే వారు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి మరుగుదొడ్లు నిర్మించి ఆత్మగౌరవాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

టాయిలెట్స్ నిర్మించాలి



బహిరంగ మలమూత్ర విసర్జన వద్దని అధికారులు అవగాహన కల్పిస్తుంటారు. అదే ప్రజలు వివిధ పనులపై ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వచ్చినపుడు మరుగుదొడ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి కార్యాలయం పరిధిలో ప్రజా మరుగుదొడ్లు నిర్మించాలి.

– సారంగం రమేష్‌బాబు, కోట

సమస్యను త్వరలో పరిష్కరిస్తాం..



కోట తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో అనేక కార్యాలయాలు ఒకే చోట ఉన్నాయి. ఇక్కడ మరుగుదొడ్లు లేక కార్యాలయాలకు వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో మరుగుదొడ్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటాం.

– జయజయరావు, తహసీల్దార్, కోట

జాతర విజయవంతం

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి పోలేరమ్మ తల్లి జాతరను అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతంగా పూర్తిచేశామని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. పట్టణంలోని తెలుగుగంగ గెస్ట్‌హౌస్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పండుగ హోదాలో వెంకటగిరిలో జరిగిన పోలేరమ్మ జాతరను అద్భుతంగా నిర్వహించినట్లు తెలిపారు. జాతరలో చిన్న చిన్న పొరపాట్లు జరిగాయని ఈ మేరకు వాటిని సరిచేసుకోనున్నట్లు తెలియజేశారు. జాతరలో రూ.100, రూ.300 క్యూల ద్వారా రూ.28,56,300 లక్షలు వచ్చినట్లు తెలిపారు. జాతరలో లక్షలాది మంది భక్తులు వచ్చారని ఈ మేరకు సహకరించిన పోలీసులు, పలుశాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ ఈఓ వెంకటశ్రీనివాసులరెడ్డి, సీఐ ఏవీ రమణ, ఎస్‌ఐ ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథం పాల్గొన్నారు.

కండలేరులో 45.070 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం 45.070 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 9,600 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1000, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



లోక్ అదాలత్‌లో న్యాయమూర్తి మీనాక్షి సుందరి, న్యాయవాదులు



లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి రాజేష్



కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి విష్ణువర్మ

నాయుడుపేటటౌన్: లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం పొందవచ్చునని నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మీనాక్షిసుందరి అన్నారు. నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో పలు కేసులను పరిశీలించిన ఆమె తీర్పు చెప్పి పరిష్కరించారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టు పరిధిలోని నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాలకు సంబంధించి మొత్తం 62 కేసులు లోక్ అదాలత్‌లో న్యాయమూర్తి పరిష్కరించినట్లు తెలిపారు. బాధితులకు నష్టపరిహారంగా రూ.21లక్షల 31 వేలు అందించినట్లు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆశా చెంచుకృష్ణయ్య, జీవీఎల్‌కే కిషోర్, పసల గంగాప్రసాద్, న్యాయవాదులు, నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, అర్బన్, రూరల్ సీఐలు బాబి, సంగమేశ్వరరావు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

గూడూరులో 248 కేసుల పరిష్కారం

గూడూరురూరల్: గూడూరు కోర్టు సముదాయంలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో 248 కేసులను రాజీమార్గంలో పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి రాజేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 248 కేసులకు సంబంధించి రూ.54,11,135 నగదు, జరిమానా ద్వారా రూ.1,56,700 అందించామన్నారు. చిన్న చిన్న గొడవలతో కేసులు పెట్టుకుని సంవత్సరాల తరబడి కోర్టు చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బును వృథా చేసుకోకుండా లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీ చేసుకుని ఇరువర్గాలు ఆనందంగా ఉండాలని సూచించారు. కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి లోక్ అదాలత్ నిర్వహిస్తారన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసు పరిష్కరించుకుంటే హైకోర్టుకు అప్పీలు ఉండదని తెలిపారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.వి.సులోచన రాణి, ఏపీపీ లక్ష్మీనారాయణ, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పి.హరిప్రసాద్, న్యాయవాదులు పార్వతయ్య, కోటేశ్వరరావు, మహబూబ్‌బాషా, పోలీసులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో 100 కేసులు పరిష్కారం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 100 కేసులు పరిష్కరిస్తూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ తీర్పునిచ్చారు. ఇందులో సివిల్ కేసులు 8, ఇందుకు సంబంధించి రూ.11.23 లక్షలు, క్రిమినల్ కేసులు 45 రూ.1,39,150 లక్షలు, చెక్‌బౌన్స్ కేసులు -2, రూ.70వేలు చొప్పున రికవరీలకు ఆదేశించారు. అదేవిధంగా భార్యభర్తలు కేసులు -2, ఎక్సైజ్ కేసులు -4 తీర్పునివ్వగా పెట్టీ కేసులు 11, రూ.72,650 నగదు, బ్యాంకుకు సంబంధించిన కేసులు 28 పరిష్కరించి రూ.15,94,249 లక్షలు రికవరీకి ఆదేశించారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 45 కేసులు రాజీ

కోట: కోట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం లోక్‌అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తి మీనాక్షి సుందరి లోక్‌అదాలత్‌ను ప్రారంభించారు. కోట, వాకాడు, చిట్టమూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 45 కేసులు రాజీ అయినట్లు ఆమె తెలిపారు. లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవ



ఊంజల్‌సేవకు స్వామి అమ్మవార్లను తీసుకొస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం సాయంత్రం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిలకు శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను అలంకార మండపంలోకి వేంచేపు చేసి అక్కడ తిరుచ్చిపై కొలువుదీర్చారు. ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం సహస్రదీపాలంకరణ మండపంలో ఊంజల్‌సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం నిత్య కల్యాణ మండపంలో స్వామిఅమ్మవార్ల కల్యాణం ఆగమోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని పునీతులయ్యారు.

అభినయ్‌ను కలిసిన గూడూరు నేతలు



అభినయ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నేతలు

గూడూరురూరల్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డిని శనివారం తిరుపతిలో ఆయన నివాసంలో గూడూరుకు చెందిన యువజన రాష్ట్ర కార్యదర్శి కొండూరు సునీల్‌రెడ్డి, ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలకు ఎవరూ భయపడవద్దని, ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించినట్లు తెలిపారు.

టీటీడీ బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం

తిరుమల : టీటీడీ బోర్డు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా దేవదాయ శాఖ సెక్రటరీ హరి జవహర్ లాల్, సభ్యుడిగా సుదర్శన్ వేణు శనివారం శ్రీవారి ఆలయంలో ప్రమాణస్వీకారం చేశారు. టీటీడీ అదనపు ఈఓ వెంకయ్యచౌదరి వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.

మత్స్య సంపద దోపిడీపై వేట బహిష్కరణ

- కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్



వేటను బహిష్కరించి ఒడ్డున చేరిన మత్స్యకారులు

వాకాడు : తమిళనాడులోని కారికల్, కడలూరు, పాండిచ్చేరికి చెందిన మత్స్యకారులు తమ సోనాబోట్ల ద్వారా సరిహద్దులోని ఆంధ్రా ప్రాంతంలో ఉన్న మూడు జిల్లాల సముద్ర తీర ప్రాంతంలో అక్రమ చేపల వేట చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 12 నుంచి చేపల వేటను 3 రోజులపాటు బహిష్కరిస్తున్నట్లు దురాయి వేశారు. కూటమి ప్రభుత్వం అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ అన్ని మత్స్యకార గ్రామాల్లో చేపల వేటను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో 179 కిలో మీటర్ల సముద్ర తీరం వెంబడి ఉన్న 113 మత్స్యకార గ్రామాల్లో ఆయా గ్రామ పెద్దల ఆదేశాలను జాలర్లు ఏకీభవించి చేపల వేటను నిలుపుదల చేసి బోట్లను ఒడ్డుకే పరిమితం చేశారు.

కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదని..

పొరుగు రాష్ట్రాల పెద్ద బోట్లు(సోనాబోట్లు) తీరానికి దగ్గరగా వచ్చి వేట చేయడంతో తమ దగ్గర ఉన్న వలలకు చేపలు లభించడంలేదని 49 వేల మంది వేట చేసే మత్స్యకారులు వాపోతున్నారు. దీంతో చేపల వేటకు వెళ్లిన ప్రతిసారి ఖర్చులు పెరిగి కనీస కూలీలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమంగా దోచుకుపోతున్నారు



పొరుగు రాష్ట్రాలకు చెందిన స్పీడు బోట్లతో చేపలను వేటచేసి అక్రమంగా దోచుకుపోతున్నా రు. తమిళ జాలర్ల అక్ర మ వేటకు నిరసనగా అన్ని మత్స్యకార జిల్లాల పెద్దలతో సంప్రదింపులు జరిపి వేటను బహిష్కరించాం. కారికల్, కడలూరు, పాండిచ్చేరి జాలర్ల బోట్లును శాశ్వతంగా అరికట్టాలి.

– మహేంద్ర, మత్స్యకార కాపు, తూపిలిపాళెం

దాడులు చేస్తున్నారు



తమిళనాడులోని కారికల్‌కు చెందిన జాలర్లు స్పీడు బోట్లతో తమ పరిధిలో అక్రమంగా వేట చేయడమే కాకుండా తమపై దాడులు చేసి గాయపరుస్తున్నారు. అలాగే వేటలో ఉన్న తమ వలలను ధ్వంసేసి లాక్కెళ్లిపోతున్నారు. ఇటీవల తమ వేట సామగ్రిని ధ్వంసం చేసి నష్టపరిచారు.

– కృష్ణ, మత్స్యకారుడు, తూపిలిపాళెం

చెంగాళమ్మ చైర్మన్ ఎవరికో?

- చర్చనీయాంశంగా మారిన చైర్మన్ పదవి
- వేనాటి వారా..తిరుమూరా
- వీడని ఉత్కంఠ...



శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం...

సూళ్లూరుపేట: పట్టణంలోని కాళంగి నదీ తీరాన ఉన్న శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ పాలక మండలి చైర్మన్ పదవి విషయంలో ఉత్కంఠ వీడడం లేదు. ఈ పదవి ఎవరిని వరిస్తుందోనని పట్టణంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఈ ఆలయానికి పాలక మండలిని ఏర్పాటు చేయలేని పరిస్థితులు నెలకొంది. కూటమి పార్టీలో నెలకొని వున్న వర్గ విభేదాలే ఇందుకు కారణమని తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీకి మొదటి నుంచి అండదండలు అందించి పార్టీని కాపాడుకుంటూ వచ్చిన వేనాటి వారు ప్రస్తుతం రాజకీయాల్లో కాస్త వెనుకబడి వున్నారు. ప్రస్తుతం నియోజకవర్గ రాజకీయాలను శాసిస్తున్న ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఆమె తండ్రి నెలవల సుబ్రమణ్యం మాత్రం పార్టీలో సీనియర్ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి పేరును ప్రతిపాదిస్తున్నారు. తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి మాత్రం పైస్థాయిలో రాజకీయం చేస్తూ తన సోదరుడు వేనాటి సురేష్‌రెడ్డి పేరును ప్రతిపాదిస్తున్నారు. ప్రస్తుతం వీరిద్దరి మధ్యనే చెంగాళమ్మ ఆలయ పాలకమండలి చైర్మన్ పదవి తిరుగుతోంది. వీరిద్దరూ కాకుండా వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లాలని తటస్థంగా వున్న దువ్వూరు బాలచంద్రారెడ్డి కూడా ఈ పదవి ఆశిస్తున్నారని తెలుస్తోంది. ఈ పదవి ఇస్తే ఆయన టీడీపీ తీర్థం పుచ్చుకోవడానికి కూడా సిద్ధంగా వున్నారు.

కోర్టుకెక్కిన అర్వభూమి వంశస్తులు..

ఈ ఆలయానికి వంశ పారపర్య ధర్మకర్తలుగా అర్వభూమి రామచంద్రారెడ్డి వంశస్తులమని కారిజాతకు చెందిన అర్వభూమి చంద్రశేఖర్‌రెడ్డి వంశపారపర్యంగా ధర్మకర్త పదవి తనకే ఇవ్వాలని కోర్టులో పిటిషన్ వేశారు. గత కాంగ్రెస్ పార్టీ హయాంలో అంటే 2004 సంవత్సరంలో ఇదేవిధంగా చంద్రశేఖర్‌రెడ్డి కోర్టుకు వెళ్లారు. అప్పుడున్న నాయకులు అతనిపై లేనిపోని విధంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించి అతన్ని నానా రకాలుగా ఇబ్బందులకు గురిచేసి స్వర్గీయ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి చైర్మన్ అయ్యారు. ఆ తరువాత 2014లో టీడీపీ అధికారంలోకి రాగా ఆలయానికి ముప్పాళ్ల వెంకటేశ్వర్లురెడ్డి చైర్మన్‌ను చేయాలనుకున్నప్పుడు కూడా చంద్రశేఖర్ రెడ్డి కోర్టు ఎక్కారు. అప్పుడు అర్వభూమి వారి వంశ వృక్షాన్ని కోర్టుకు పొందుపరిచారు. నిజమైన అర్వభూమి వంశస్తుడు చంద్రశేఖర్‌రెడ్డి కాదని, అసలు సిసలైన వారసుడు అర్వభూమి సాయిరెడ్డి అనే యువకుడని నిర్ధారించి వెంకటేశ్వర్లురెడ్డి చైర్మన్ అయ్యారు. మళ్లీ ఇప్పుడు అదే చంద్రశేఖర్‌రెడ్డి కోర్టుకెళ్లడంతో టీడీపీ నాయకులు కూడా అతనిపై సంబంధంలేని వ్యక్తితో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించి కూటమి ప్రభుత్వం ఆయనపై విషం కక్కుతోంది. ఆయన్ని అడ్డు తొలగించుకునే క్రమంలో కూటమి ప్రభుత్వం పెద్దలు లేని కేసులు పెట్టి చంద్రశేఖర్‌రెడ్డిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆయన్ను హింసించి అయినా సరే ఆయన అడ్డు తొలగించేందుకు కూటమి నేతలు తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఇబ్బందులన్నింటిని అధిగమించేది ఎప్పుడు? ఆలయానికి చైర్మన్ పదవి ఎంపికయ్యేదెప్పుడు అనే సందిగ్ధమైన పరిస్థితులు నెలకొన్నాయి.